- మృగశిర చేప రుచి చూడాల్సిందే!

మృగశిరను పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా తాను కొన్న భారీ చేపను చూపుతున్న ఓ వినియోగదారుడు

వ్యాపారుల చేతచిక్కి.. అన్నదాతల విలవిల

- యాసంగికి పెట్టుబడి అందక అవస్థ
- ఎలాగోలా పంట వేసేందుకు అప్పులు
- తీరా నీళ్లందక ఎండిన పాలాలు
- పంటనష్టంతో అప్పు కట్టలేక తిప్పలు
- వడ్డీలతో పీడిస్తున్న వ్యాపారులు
- వెలుగులోకి వచ్చిన దారుణాలు
- 2,040 ప్రామిసరీ నోట్లు, 92 పాస్‌బుక్కులు స్వాధీనం

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): గత యాసంగికి ఎన్నికల కోడ్‌ను బూచిగాచూపి కాంగ్రెస్ నాయకులు రైతుబంధును అడ్డుకున్నారు. అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం ఇవ్వకుండా జాప్యం చేశారు. దీంతో ఎలాగైనా వేసిన పంటలను కాపాడుకునేందుకు చిన్న, సన్నకారు రైతులు వడ్డీవ్యాపారుల వద్ద అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. తీరా సర్కారు సాగునీరు అందించకపోవడంతో ఎక్కడి పంటలు అక్కడే ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారు. తీసుకున్న రుణం కట్టలేని దుస్థితిలో ఉన్న రైతుల నుంచి ఇప్పుడు ప్రైవేట్ వ్యాపారులు ముక్కుపిండి మరీ అధికవడ్డీ వసూలు చేస్తున్నారు. అన్నదాతల నుంచి తాకట్టుపెట్టుకున్న పాస్‌బుక్కులు, బండ్లు, బంగారం వంటివి పూర్తిగా తమవద్దే ఉంచుకునే ప్రయత్నం చేశారు. ఈ దారుణాలన్నీ సాక్షాత్తూ ఇటీవల పోలీసులు జరిపిన దాడుల్లో బయటపడ్డాయి.

మల్టీజోన్-1లో పోలీసులు ఏప్రిల్‌లో చేసిన సోదాల వివరాలు

జిల్లా	కేసులు	నిందితులు	నగదు	ప్రామిసరీ నోట్లు	బ్యాంక్ చెక్కులు	బాండ్ పేపర్స్	పాస్ బుక్స్	బంగారం (గ్రాముల్లో)
ఆసిఫాబాద్	10	10	9,26,200	122	373	167	55	5.5
భూపాలపల్లి	12	12	--	190	167	0	36	0
ములుగు	4	4	4,57,410	90	8	0	0	0
జగిత్యాల	27	27	24,20,670	716	67	22	1	1506
కరీంనగర్	7	7	27,56,800	0	0	0	0	0
సిద్దిపేట	42	42	1,39,79,850	286	0	0	0	0
రాజన్న సిరిసిల్ల	15	15	11,13,000	205	31	0	0	0
కామారెడ్డి	28	28	49,58,140	439	31	8	0	157
మొత్తం	145	145	2,66,12,070	2,040	677	1,967	9	1669

వడ్డీలు, చక్రవడ్డీల ఉచ్చు

ఎకరానికి రూ.15వేల రైతుభరోసా అందుతుందనే నమ్మకంతో అధిక వడ్డీ అయినా అప్పు చేసిన రైతులు ప్రభుత్వ నిర్వాకంతో తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. వ్యాపారులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి వడ్డీ, చక్రవడ్డీల పేరుతో ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అప్పు కడతారో లేదోనని కొందరు వ్యాపారులు రైతులు తాకట్టుపెట్టిన పాస్‌బుక్కులు, ఇంటి పత్రాలు, వాహనాలు, బంగారం తమ పేరిట రాయించుకునే ప్రయత్నం చేశారు. వ్యాపారుల ఆగడాలు భరించలేక కొందరు రైతులు పోలీసులను ఆశ్రయించారు. తెలంగాణ వ్యాప్తంగా ఇలాంటివి ఎక్కువ నమోదు కావడంతో మల్టీజోన్-1 పరిధిలో ఐజీ రంగనాథ్ వడ్డీ వ్యాపారులపై ఏకకాలంలో దాడులు చేయించారు.

రూ.2కోట్ల నగదు, బంగారం, పాస్‌బుక్కుల స్వాధీనం

ఏప్రిల్‌లో వడ్డీ వ్యాపారుల ఆగడాలు పెరిగాయని 16 జిల్లాల్లో ఇటీవల స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సోదాలు చేశారు. రూ.2,66,12,070, కిలోన్నర బంగారం, 2,040 ప్రామిసరీనోట్లు, 677 చెక్కులు, 1,967 బాండ్ పేపర్లు, 92 పాస్‌బుక్కులు, 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

రామోజీరావుకు అస్వస్థత

హుటాహుటిన దవాఖానకు తరలింపు

వెంటిలేటర్‌పై వైద్యుల చికిత్స

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కొంతకాలంగా రామోజీరావు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవలే స్టంట్ కూడా వేసినట్టు సమాచారం. అయితే శుక్రవారం రాత్రి ఒక్కసారిగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం రామోజీరావు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నట్టు తెలిసింది.

కదులుతున్న 'భూ'చోళ్ల డొంక!

- 'ధరణి' ఆపరేటర్ల బరి తెగింపు
- అక్రమార్కుల చేతుల్లోకి కోట్ల విలువైన సర్కారు స్థలాలు
- గత అసెంబ్లీ ఎన్నికలప్పుడే అక్రమాలకు స్కెచ్
- పోకల్‌వాడలో 500 కోట్ల భూమి స్వాహా చేసిన ఘటన
- అధికారుల అంతర్గత విచారణ

రంగారెడ్డి, జూన్ 7 (నమస్తే తెలంగాణ): కొంతమంది రియల్టర్లు ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు. ఇందుకు రెవెన్యూశాఖలోని ఇంటిదొంగలే ఊతమిస్తున్నారు. ముఖ్యంగా 'ధరణి' ఆపరేటర్లు బరితెగించి డిజిటల్ సంతకాలతో అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారు. కలెక్టర్ల డిజిటల్ 'కీ'ని ఉపయోగించి తప్పుడు పత్రాలతో ఈ-పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏకంగా 98 ధరణి దస్త్రాలకు దొడ్డిదారిన ఆమోదం తెలిపిన భూస్వాహాపర్వంపై ముమ్మర విచారణ జరుగుతున్నది. పోకల్‌వాడలో రూ.500 కోట్ల భూ స్కాం వంటి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ధరణి ఆపరేటర్లపైనే ఆరోపణలు ఉండగా.. ఇందులో పెద్దల పాత్రపై వివిధ స్థాయిల్లో అంతర్గత విచారణ జరుగుతున్నది.

డిజిటల్ 'కీ'తోనే అక్రమాలు

డిజిటల్ సంతకాల తాళంచెవి (కీ) అక్రమాలకు ఆజ్యం పోస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో గత ఏడాది అక్టోబర్, నవంబర్‌లో 98 ఫైళ్లకు సంబంధించి ధరణిలో అక్రమాలావాదేవీలు జరిగినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. దీనికి ఊతమిచ్చేలా రెవెన్యూ అధికారులు ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సైతం రిజిస్ట్రేషన్లు జరిగాయి. కలెక్టర్ దగ్గర దీనికి సంబంధించి 'కీ' ఉండగానే ఈ వ్యవహారం చోటుచేసుకొన్నది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం అప్పటి కలెక్టర్ భారతి హోళికేరిపై బదిలీవేటు వేసింది.

సీరియస్‌గా విచారణ

రంగారెడ్డి జిల్లాలో 'ధరణి' ముసుగులో జరిగిన అక్రమాలను తేల్చేందుకు వివిధ శాఖలు సీరియస్‌గా విచారణను సాగిస్తున్నాయి. ప్రస్తుత కలెక్టర్ శశాంక.. ప్రత్యేకదృష్టి సారించారు. ప్రభుత్వ భూమికి పట్టాలను జారీచేసి పోకల్‌వాడలో హెచ్‌ఎండీఏ, ప్రైవేటు భూముల మధ్య ఉన్న రూ.500 కోట్ల విలువైన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేశారు. పోలీస్ శాఖ, సీసీఎల్ఏ, ఆర్థిక నేరాల విభాగం రంగంలోకి దిగి పక్కా ఆధారాలను సేకరిస్తూ సూత్రధారులను గుర్తించే పనిలో నిమగ్నమైనట్టు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి విచారణ నివేదికలేవీ లేకుండానే కలెక్టరేట్‌లోని ధరణి డెస్క్‌లలో హక్కులు జారీ కావటం, హక్కులు కల్పించిన దస్త్రాలకు సంబంధించి బ్యాకప్ పోర్టల్‌లో సమాచారం కనిపించకపోవటం వంటివి అధికారులకు విస్మయం కలిగిస్తున్నాయి. వాస్తవాలను కలెక్టరేట్ నుంచి అధికారులు సీసీఎల్ఏకు అందజేసినట్టు తెలిసింది. తప్పంతా ఆపరేటర్లదే అన్న ప్రచారం జరుగుతున్నా, పైస్థాయి అధికారుల ప్రమేయం కూడా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంగట్లో తెలంగాణ పోలీస్ డాటా!

ఇటీవల హ్యాక్ ఐ, ఎస్ఎంఎస్‌లు హ్యాక్

తాజాగా 'టీఎస్ కాప్' యాప్ కూడా..

రెండిట్లో 12 లక్షల మంది సమాచారం

డార్క్‌వెబ్‌లో 120 డాలర్లకు సేల్

తెలంగాణ పోలీసుల దిద్దుబాటు చర్యలు

TSCOP real-time policing

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీస్ శాఖ సాంకేతిక వ్యవస్థలోని కీలక సమాచారంతా అంగట్లో సరుకుగా మారింది. డాటాబేస్ నుంచి నేరస్తుల సమాచారం మొదలు.. మహిళలు, పోలీస్‌స్టేషన్ల మెట్లెక్కిన బాధితుల వ్యక్తిగత వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కాయి. డార్క్‌వెబ్‌లో డాలర్లకు ఇంత చొప్పున సమాచారం అమ్మేస్తున్నారు. ఇటీవల 'హ్యాక్ ఐ' యాప్, తెలంగాణ పోలీస్ ఎస్ఎంఎస్ సర్వీస్ పోర్టల్ నుంచి డేటాను దొంగించిన సైబర్ నేరగాళ్లు.. శుక్రవారం 'టీఎస్ కాప్' అనే యాప్‌ను సైతం హ్యాక్ చేశారు. ఈ మూడు కీలక డేటా బేస్‌ల నుంచి సుమారు 12 లక్షల మంది సమాచారం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లినట్టు సమాచారం. ఈ మూడు వ్యవస్థల నుంచి సేకరించిన డేటాను 'బ్రీచ్ ఫోరం'లో అమ్మకానికి పెట్టారు. కేవలం 120 డాలర్లు చెల్లించిన వారందరికీ ఈ డేటాను విక్రయిస్తున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రంగంలోకి దిగారు. ఐటీ చట్టం కింద దర్యాప్తు చేస్తున్నామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయల్ తెలిపారు. 'హ్యాక్ ఐ' యాప్‌ను హ్యాక్ చేసిన వారే.. టీఎస్ కాప్ యాప్‌ను సైతం హ్యాక్ చేశారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించినట్టు తెలిసింది.

'టీఎస్ కాప్' హ్యాక్‌పై ఆందోళన

టీఎస్‌కాప్ యాప్‌లో తెలంగాణ పోలీసుల నెట్‌వర్క్ సమగ్ర సమాచారం మొత్తం ఉంటుంది. ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుళ్ల వరకూ అందరి సమాచారం ఉంటుంది. పెట్రోలింగ్ సమయంలో తీసిన వ్యక్తుల చిత్రాలు, ఇంటిగ్రేటెడ్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్, నేరస్తుల ఫొటోలు, నేరాల దృశ్యాలు, గుర్తు తెలియని పిల్లలు, మహిళలు, పురుషులు, మృతదేహాల ఫొటోల వంటివి ఉన్నాయి. తుపాకీ లైసెన్స్‌లు పొందిన వారి వివరాలు, అధికారుల వివరాలు ఉన్నాయి. ఈ యాప్‌ను వినియోగించేవారు పాస్‌వర్డ్‌ను స్ట్రాంగ్‌గా పెట్టుకోవాలని అధికారులు సూచించారు.

వక్రబుద్ధి.. అక్రమ సంపాదన

- రెవెన్యూ శాఖలో ఓ ఉద్యోగి లీలలు
- భూమి లేకున్నా తల్లిపేర పట్టా
- సహకరించిన అప్పటి తహసీల్దార్
- ఆరేండ్లుగా రైతుబంధు లబ్ధి
- సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

ములుగు, జూన్ 7 (నమస్తేతెలంగాణ) : రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి వక్రబుద్ధి చూపాడు. వచ్చే జీతం చాలదని అక్రమ సంపాదనపై కన్నేశాడు. తాను విధులు నిర్వర్తిస్తున్న శాఖనే అక్రమార్జనకు వాడుకున్నాడు. అసలు భూమి లేకున్నా 9 ఎకరాలను తన తల్లి పేరిట పట్టా చేయించి, రైతుబంధు డబ్బుల కాజేస్తున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో వెలుగు చూసింది. గోవిందరావుపేట మండలం చల్వాయికి చెందిన గద్దల రాజు పదేండ్ల కిందట వారసత్వ ఉద్యోగం కింద తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరాడు. మొదట వీఆర్ఏగా పనిచేశాడు. 2018లో తహసీల్దార్ రవి రాజ్‌కుమార్ ద్వారా తన తల్లి గద్దల చిలకమ్మ పేరుపై భూమి నమోదు చేయించుకొన్నాడు. కర్లపల్లి పరిధిలోని సర్వే నంబర్ 175లో 5ఎకరాలు, లక్నవరం శివారులోని 556 సర్వే నంబర్‌లో 4ఎకరాలున్నట్టు మొత్తం తొమ్మిదెకరాల భూమికి పట్టా పాస్ పుస్తకం పొందాడు. 2018లో రైతుబంధు పథకం ప్రారంభమైనప్పుడు పాస్ పుస్తకంతో దరఖాస్తు చేశాడు. అప్పటి నుంచి ఏటా రూ.90 వేలు పొందుతూ అక్రమార్జనకు తెగబడ్డాడు.

ఉద్యోగం చేస్తూ సర్కారు సొమ్ముపై కన్ను

గోవిందరావుపేట మండలంలో ఒక్కో సర్వే నంబర్ మీద 300 నుంచి 500 ఎకరాల భూమి ఉంటుంది. రైతుబంధు పథకంలో సొమ్మును దక్కించుకునేందుకు నాడు తహసీల్దార్‌గా పనిచేసిన రవిరాజ్‌కుమార్‌తో పాటు కింది స్థాయి ఉద్యోగులు ఎకరానికి రూ.5 వేల నుంచి రూ.10వేలు వరకు ఇచ్చి వారికి ఆయా సర్వే నంబర్లలో భూమిని నమోదు చేసి.. పట్టాపాస్ పుస్తకాలను మంజూరు చేశారు. మండలంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగుల నుంచి మొదలుకొని వివిధ వర్గాలకు చెందిన పలువురు అక్రమంగా భూమిని నమోదు చేయించుకొని పట్టా పాస్ పుస్తకాలు పొంది రైతుబంధు పొందుతున్నట్టు స్థానికంగా చర్చ జరుగుతున్నది. ఇంచర్ల శివారులోని రామప్ప చెరువు శిఖం భూముల్లోనూ చాలా మంది పట్టాలు చేయించుకున్నారు. వారికి సర్వే నంబర్, పట్టా పాస్‌పుస్తకం తప్ప ఏమీ తెలియని పరిస్థితి. కలెక్టర్ స్పందించి జిల్లావ్యాప్తంగా ఇలాంటివారి వివరాలను సేకరిస్తే ఎన్నో అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉన్నది. భూ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గద్దల చిలుకమ్మ పేరిట ఉన్న భూమి

భూ సర్వే చేయాలంటే లక్ష డిమాండ్

వెంకటాపూర్, జూన్ 7: భూ సర్వేకు లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని రైతు బోల్లవేన వీరస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలో రైతు వీరస్వామికి ఐదెకరాల పట్టా భూమి ఉన్నది. అదే సర్వే నంబర్లతో మరొకరు భూమి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాడని తెలిసి వీరస్వా మి.. తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్‌ను కలువగా రూ.లక్ష ఇస్తే నీ భూమి నీకే ఉంటుందని డిమాండ్ చేశారు. దీంతో వీరస్వామి అప్పు చేసి చెల్లించినా సర్వే చేయలేదు. మళ్లీ అడిగితే తహసీల్దార్‌ను కలువాలని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మద్యం కొరత మతలబు?

మొదటిపేజీ తరువాయి...

గతంలో ఎన్నో విమర్శలు ఉండేవి. తెలంగాణలో మాత్రం మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలుచేశారు. అంతర్జాతీయంగా పేరుగాంచిన బీర్లు, ఆల్కహాల్ బ్రాండ్లు తెలంగాణలో లభించేవి. నగరం కాస్మోపాలిటన్ సిటీ కావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడా మద్యం కంపెనీలతో లాలూచీ పడలేదు. డిమాండ్‌కు అనుగుణంగా ఇండెంట్లు పెట్టారు. కానీ, రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం విధానంలో ఊహించని మార్పు వచ్చిందని మద్యం వ్యా పారులు చెప్తున్నారు. బీఆర్ఎస్ సర్కారున్నపుడు పెట్టిన ఇండెంట్లలో ఇప్పుడు అయిదో వంతు కూడా పెట్టకుండా ఉద్దేశపూర్వకంగా బీర్లకు కృత్రిమ కొరత సృష్టించారని చెప్తున్నారు. కొరత తీవ్రం కావడంతో హఠాత్తుగా కొత్త కంపెనీలకు అనుమతులు మంజూరు చేశారని అంటున్నారు. కొత్త కంపెనీలకు ఎం దుకు అనుమతులు ఇచ్చారంటే.. పాత కంపెనీలు డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంలేదన్న ప్రచారం మొదలు పెట్టారని ఆరోపిస్తున్నారు.

ఉద్దేశపూర్వకంగానే బకాయిలు కట్టలేదా?

మద్యం కంపెనీలకు సకాలంలో ఎందుకు ఇండెంట్లు పెట్టలేదన్న ప్రశ్నకు ప్రభుత్వం ఇస్తున్న సమాధానం విస్మయం గొలుపుతున్నది. పాత బకాయిలు సుమారు రూ. 3000 కోట్లు ఉన్నాయని, అవి చెల్లించకపోవడంతో కంపెనీలు సరఫరా తగ్గించాయని పేర్కొంది. డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం రాబడిని మాత్రమే చూసిందని, ఉద్దేశపూర్వకంగానే కంపెనీలకు బకాయిలను పూర్తిగా చెల్లించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బకాయిలు కేవలం రూ.2000 కోట్ల వరకు ఉంటాయని చెప్తున్నారు. ప్రభుత్వానికి ప్రతి నెల మద్యం ద్వారా సుమారు రూ.3000 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని, ఒక్క నెల ఆదాయాన్ని పాత బకాయిలకు చెల్లించినా సరిపోయేదని అంటున్నారు. ఒకవేళ ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోతే బ్యాంకు షూరిటీలు కూడా ఇచ్చి మద్యం కొనుగోళ్లు చేసే అవకాశం ఉంటుందని మద్యం వ్యాపారులు చెప్తున్నారు. ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసి దాన్ని పాత ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేశారని విమర్శలు వస్తున్నాయి. కేవలం తమకు అనుకూలమైన సంస్థలను, వాటి బ్రాండ్లను ప్రవేశపెట్టేందుకే పాత బకాయిలు చెల్లించకుండా.. ఇండెంట్లు పెట్టకుండా కృత్రిమ కొరత సృష్టించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా కొందరు ప్రభుత్వ పెద్దల అండదండలతోనే జరిగిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

బీర్ల కొరతతో మళ్లీ సిండికేట్?

రాష్ట్రంలో దాదాపు రెండు నెలలుగా బ్రాండెడ్ బీర్లు దొరకడం లేదు. అంతర్జాతీయంగా పేరున్న కింగ్‌ఫిషర్ లైట్ కోసం ఇండెంట్లు పెట్టిన దుకాణదారులకు రేషన్ పద్ధతిలో సప్లయ్ చేస్తున్నారు. ఏటా వేసవిలో బీర్లకు భారీ డిమాండ్ ఉంటుంది. అయితే కొందరు ప్రభుత్వ పెద్దలు ఎక్సైజ్‌శాఖ వేసవి ప్రణాళికలకు అడ్డు తగిలారని సమాచారం. ఫలితంగా ఏ జిల్లాలో చూసినా బ్రాండెడ్ బీర్ల కొరత భారీగా ఏర్పడింది. కొందరు రేషన్ పద్ధతిలో వచ్చిన బీర్లను కొంత కమీషన్‌కు బెల్ట్‌షాపులకు విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. ఇలా కమీషన్ల కోసం కొందరు వ్యాపారులు మళ్లీ సిండికేట్ అయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల్లో రూ.150-160 ధరకు వచ్చే బీర్లను బెల్ట్‌షాపుల్లో రూ.200 పైగా ధరకు విక్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొత్త బ్రాండ్లు తేవాల్సిన అవసరమేంటి?

మద్యాన్ని కృత్రిమంగా నిలిపివేసి కొత్త బ్రాండ్లను తీసుకురావాల్సిన అవసరం ఏమిటని మద్యం ప్రియులు ప్రశ్నిస్తున్నారు. కేఎఫ్ లైట్, స్ట్రాంగ్, అల్ట్రా, 5000, నాకౌట్, బడ్‌వైజర్, ఖజురహో, ఆఫీసర్స్ చాయిస్ వంటి ప్రముఖ బ్రాండ్ల సరఫరా తగ్గడానికి గల కారణాలు ఏమిటో చెప్పాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు. ఏదో మతలబు ఉన్నదని, ముందే ఊహించామని ప్రతిపక్షం ఆరోపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే వివాదాస్పద సోం డిస్టలరీస్‌తోపాటు మరికొన్ని సంస్థలకు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చింది. కొత్త కంపెనీల నుంచి వచ్చే 27బ్రాండ్ల బీర్ల వెనుక ఉన్న మతలబు ఏంటో వివరంగా చెప్పాలని ఇటు ప్రతిపక్ష నాయకులు, అటు మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

కల్తీ మద్యాన్ని ప్రవేశపెట్టొద్దు

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వండి.. సీఎంకు బీఆర్ఎస్ నేత క్రిశాంక్ లేఖ

కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సోం డిస్టలరీస్ కల్తీ బీరు సీసాలను ధ్వంసం చేసిన ఫొటోను బహిరంగ లేఖకు జత చేసిన క్రిశాంక్

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కల్తీ మద్యం ప్రవేశపెట్టవద్దని, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీయవద్దని సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేత క్రిశాంక్ సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కల్తీ మద్యం లేకుండా ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చామని.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం నకిలీ బీరును తయారు చేసే కంపెనీలకు అనుమతులిచ్చి ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేయవద్దని కోరారు. 'సోం' డిస్టలరీస్‌కు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తారని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌కు క్రిశాంక్ లేఖ రాశారు. గతంలో 'సోం' డిస్టలరీస్‌కు ఎలాంటి అనుమతులివ్వలేదన్న మంత్రి జూపల్లి కృష్ణారావు.. తర్వాత అనుమతులు ఇవ్వడం వాస్తవమేనని ఒప్పుకున్న విషయాన్ని క్రిశాంక్ ప్రస్తావించారు.

సంక్షేమ పథకాల అమలుకు ఎక్సైజ్ శాఖే దిక్కు!

గత ప్రభుత్వం ఓ క్రమపద్ధతిలో మద్యం అమ్మకాలు చేపట్టినా కూడా.. 'తెలంగాణను తాగుబోతు రాష్ట్రంగా చేశారు' అని నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న రేవంత్‌రెడ్డి ఆరోపించేవారు. ఇప్పుడు ఆయన అధికారంలోకి రావడంతోనే ప్రజాపాలన పేరుతో ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ఎక్సైజ్‌శాఖపైనే ఆధారపడ్డారని విశ్లేషకులు అంటున్నారు. అందుకే ఎక్కువగా మద్యం అమ్మకాలు జరపాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు అభిప్రాయపడుతున్నారు. పన్నులు, ఫీజుల రూపంలో ఎక్సైజ్ శాఖకు ప్రతి నెలా రూ.3 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. ప్రభుత్వానికి కొన్ని పథకాలు అమలు చేసేందుకు తక్షణం నిధులు అవసరం కావడంతో మద్యంపై వచ్చే ఆదాయం లక్ష్యాన్ని ఏటా రూ.45వేల కోట్లకు పెంచింది. ఈ నేపథ్యంలోనే ప్రతిరోజూ ఒక్కో మద్యం షాపునకు రూ.50 లక్షల రాబడి టార్గెట్ ఉండాలని ప్రభుత్వ పెద్దలు పథకం రచించినట్టు తెలిసింది. ఈ విధంగా ప్రతిరోజు రూ.130 కోట్ల వరకు రాబడి వస్తే.. నెలకు రూ.3,900 కోట్లు.. ఏడాదికి రూ.46,800 కోట్లు రాబడి సాధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలోనే కొత్త కంపెనీలకు అనుమతులు ఇచ్చారని చెప్తున్నారు.

జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ పరిధిలోని పొలాల్లో నిలిచిన వరదనీరు

భారీ వర్షం.. పొంగుతున్న వాగులు

- ఉమ్మడి పాలమూరులో భారీ వర్షం
- వివిధ ప్రాంతాల్లో పిడుగుపాటుకు తొమ్మిది మంది మృతి
- 4 రోజుల్లో రాష్ట్రమంతటా నైరుతి

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. దాంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. బీకే తిర్మలాపూర్ చెరువు నిండుకుండలా మారింది. మొల్కమామిడిలోని బండలదేవి చెరువు, ధర్మ సముద్రం, తుర్కల చెరువు అలుగుపారాయి. కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్-ముక్కిడిగుండం గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు ఉప్పొంగింది. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఆయా కాలనీలు నీటమునిగాయి. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం గౌరి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. స్థానిక హనుమాన్ ఆలయం పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. పెద్ద వృక్షాలు నేలకూలాయి. విద్యుత్తు తీగలు తెగిపోవడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పిడుగుపాటుకు ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాలో నలుగురు చొప్పున, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒకరు మృతిచెందారు.

మరో మూడు రోజులు వర్షాలు

రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురువొచ్చని తెలిపింది. హైదరాబాద్, కుమ్రంభీం, మహబూబ్‌నగర్, మెదక్, మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, నారాయణ్‌పేట్, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మరో నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాయని అంచనా వేసింది.

కుండపోత వర్షాలపై అప్రమత్తత : సీఎస్

రాష్ట్రంలో ఆకస్మికంగా కుండపోత వర్షం కురిస్తే తక్షణం తీసుకోవాల్సిన చర్యలు, శాశ్వత నివారణ చర్యలపై ప్రణాళికలు రూపొందించాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. శుక్రవారం ఆమె సచివాలయంలో పలు విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించారు. హైదరాబాద్‌లో 134 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని తెలిపారు. సమీక్షలో డీజీపీ రవి గుప్తా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, విపత్తుల నిర్వహణ, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

80 క్వింటాళ్ల వరి